క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ ప్రకటించారు. నల్లకుంట ఫీడర్ పరిధిలో భారతీ ఇన్‌స్టిట్యూట్, విజయాబ్యాంక్, తిలక్‌నగర్ రోడ్డు, ఫీవర్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, ఆజామాబాద్ ఫీడర్ పరిధిలో మజీద్ లేన్, రాంనగర్‌గుండు తదితర ప్రాంతాల్లో 11.30 గంటల నుంచి 01.30 వరకు, 44 నెంబర్ బస్టాప్ ఫీడర్ పరిధిలో ఎంఎన్ఆర్ బార్, పార్శిగుట్ట గ్రేవ్‌యార్డ్, బ్రహ్మంగారి దేవాలయం, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో 12 గంటల నుంచి 2 గంటల వరకు, చిక్కడపల్లి ఫీడర్ పరిధిలో నారాయణగూడ, చిక్కడపల్లి, ఉమాగారైన్, వేంకటేశ్వర దేవాలయం తదితర ప్రాంతాల్లో 2.30 గంటల నుంచి 5 గంటల వరకు కోత ఉంటుందన్నారు.

నీలా శ్రీధర్‌కు సినారె అవార్డు



కాచిగూడ: అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రముఖ సంఘసేవకులు డాక్టర్ నీలా శ్రీధర్‌కు 2023 సంవత్సరానికి డాక్టర్ సి.నారాయణరెడ్డి అవార్డును 'శిఖరం ఆర్ట్స్ థియేటర్స్' చైర్మన్ జి.కృష్ణ ప్రకటించారు. సాంస్కృతిక, సేవా రంగాల్లో ఆయన గత 35 ఏళ్లుగా విశేష సేవలు అందించిన సందర్భంగా ఈ అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

పీఆర్‌సీ పాత బకాయిలను విడుదల చేయాలి

ముషీరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 7వ పీఆర్‌సీ పాత బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం(టీడీఎల్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చింతల కిషోర్‌కుమార్ కోరారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం 7వ పీఆర్‌సీ ఇవ్వాలని సిఫార్సు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని రాష్ట్రంలో ఉన్న అధ్యాపకుల పీఆర్‌సీ బకాయిలు కేంద్ర ప్రభుత్వం వాటా 50 శాతం(రూ.130.90) కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా 50 శాతం(రూ.130.90) కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జీఓ 59 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలని వినతి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ ఎస్సార్టీ, టీఆర్టీ క్వార్టర్స్‌లో ఖాళీ స్థలాలను జీవో 59 ప్రకారం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని హైదరాబాద్ ఆర్డీఓ వెంకటాచలంకు కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న వందలాది మంది లబ్ధిదారులు క్వార్టర్స్ ముందు ఖాళీ స్థలాల్లో ఇళ్లను నిర్మించుకున్నారన్నారు. సదరు స్థలాలను జీఓ 59 ప్రకారం తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్నారన్నారు. ఎలాంటి సమస్యలున్నా కార్పొరేటర్ కార్యాలయం 7799819991 నంబరును సంప్రదించాలని కోరారు.

ఓటింగ్ యంత్రాల వినియోగంపై అవగాహన



కాచిగూడ: భారత ఎన్నికల సంఘం సంచార ప్రదర్శన ద్వారా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై కాచిగూడ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు జీహెచ్ఎంసీ ఎన్నికల అధికారులు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్ యంత్రాల వినియోగంపై బుధవారం విద్యార్థులకు మున్సిపల్ అధికారి దివ్య వివరించారు. మాస్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులు వేసిన ఓట్లు స్లిప్పులను వారికి చూపించారు. విద్యార్థుల్లో ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సంచార ప్రదర్శన వాహనం ద్వారా ప్రత్యేకంగా వివరిస్తామన్నారు.

రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య

కాచిగూడ: ఇంటర్ పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తాయేమోనని ఓ విద్యార్థి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం రైల్వేహెడ్ కానిస్టేబుల్ చిన్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జె.భరత్‌రాజ్ (18) ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కాగా పరీక్షలో తక్కువ మార్కులు వస్తాయని మనస్తాపంతో బుద్వేల్-శివరాంపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్‌పై పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి

జాతీయ పతాక రూపశిల్పికి గౌరవం కల్పించాలని పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ డిమాండ్



నివాళులర్పిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు జగదాంబ



జగదాంబను సన్మానిస్తున్న సంగిశెట్టి జగదీష్

నల్లకుంట: భారత జాతీయ పతాక రూపకర్త దివంగత పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలని పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు జగదాంబ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో పింగళి వెంకయ్య 145వ జయంతిని పురస్కరించుకొని స్మారకసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. యావత్ దేశాన్ని ఒక్కటిగా చేసే శక్తి జాతీయపతాకానిదని, ఆ జెండాకు లభిస్తున్న గౌరవంలో పతాక రూపకర్తకు లభిస్తున్న గౌరవం ఎంతని ప్రశ్నించారు.

- గత నూరేళ్లుగా పింగళి జయంతిని విజయవంతంగా నిర్వహిస్తున్న ఘనత పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్‌దేనని స్పష్టం చేశారు.
- జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవమైన మార్చి 31, 1921 నుంచి ఏప్రిల్ రెండు వరకు మూడు రోజుల పాటు అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.
- పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలకు సహకారమందించాలని దాతలకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడి అన్ని విషయాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు. బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్‌రాజ్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ట్రస్టసభ్యులు సీతారత్నం, నాదెళ్ల అన్నపూర్ణ, శ్యామలరావు, మేఘన, శ్రీకాంత్, అనుదీప్, సాయికిరణ్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: రాంనగర్ గుండులోని పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంగిశెట్టి జగదీష్ హాజరై పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ట్రస్ట్ చైర్మన్ హెచ్.కే.జగదాంబకు సత్కారం చేశారు. జగదీష్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఆయన చేసిన సేవలను భావితరాలకు తెలిసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నెక్లెస్ రోడ్డులో ఆయన స్మారక మ్యూజియం, విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కేశవ, శ్రీరాములు, వచన్‌కుమార్, కర్దం సురేష్, నవీన్‌కుమార్, శ్యామలరావు, నాయకులు పాల్గొన్నారు.

రూ. 81.75 లక్షలతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డిలు

అంబర్‌పేట: నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి రూ.81.75 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు మౌలిక సమస్యలు పరిష్కరించేందుకు శాశ్వత ప్రాతిపాదికన అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ ప్రజలకు తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. అధికారులు, స్థానిక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రూ.22 లక్షలతో అంబర్‌పేట డివిజన్‌లో..

- అంబర్‌పేట డివిజన్ అహ్మద్‌నగర్‌లో రూ.22 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, జాఫర్ తదితరులున్నారు.

సీనియర్ జర్నలిస్టు వీరన్న సేవలు మరువలేనివి




ముషీరాబాద్: నిరంతరం ప్రజా సమస్యలు, సమాజ హితం కోసం జర్నలిస్టుగా మద్దినేని వీరన్న చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. నియోజకవర్గంలో గత దశాబ్దకాలంగా వివిధ పత్రికల్లో సీనియర్ జర్నలిస్టుగా విధులు నిర్వహిస్తూ.. మద్దినేని వీరన్న అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. గత కొంతకాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్న వీరన్న(48) మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ.. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. అంత్యక్రియలు మహబూబాద్ జిల్లా బయ్యారంలోని ఆయన స్వగ్రామంలో బుధవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, బీఆర్ఎస్ నేతలు ఎస్.డీ.సాయికృష్ణ, రాజశేఖర్‌గౌడ్, ఆర్.రాంచందర్, లక్ష్మీనారాయణ, జమాలుద్దీన్ నివాళులర్పించారు. తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రాం, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్‌గంగపుత్ర, కేశవరాజులు తమ సంతాపం ప్రకటించారు.

రైతులకు పంటనష్ట పరిహారం చెల్లించాలి

నల్లకుంట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంట నష్టాన్ని అంచనా వేసి తక్షణమే ఎకరాకు రూ. 20 వేల చొప్పున నష్ట పరిహారం అందజేయాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జోగినపల్లి రంగారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పాత నల్లకుంటలోని బీకేఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా లక్షలాది ఎకరాల్లో సాగుచేసిన వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చీ, కూరగాయలు ఇతర పంటలు పూర్తిగా నీట మునిగి పోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి వెంటనే విపత్తు నిర్వహణ నిధుల నుంచి పరిహారం చెల్లించాలని కోరారు. బీఎస్‌కే జాతీయ కార్యదర్శి కోడెల సాయిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం అమలులో లేదని, దీంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రైతులకు కలిగే నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని బీకేఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముదుగంటి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి రాజిరెడ్డి, బీకేఎస్ భాగ్యనగర్ అధ్యక్షుడు వినోద్‌కుమార్, డాక్టర్ ఏవీరావు, మాణిక్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శరత్ పాల్గొన్నారు.

జీఓ 46 ప్రకారం కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయాలి



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 46 ప్రకారమే పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ.. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కానిస్టేబుల్ అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. బుధవారం ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు రమేష్, శరత్, భానునాయక్, సతీష్, సురేష్, రాము, నాగేష్‌లు మాట్లాడుతూ.. 201 నోటిఫికేషన్ ఆధారంగా నియామకాలు చేపడితే అన్ని జిల్లాలకు చెందిన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం 2022లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఈ జీవో 46ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ జీవో వల్ల 33 జిల్లాలకు న్యాయపరమైన రేషియో జరుగుతుందన్నారు. ఉత్తర తెలంగాణకు 100 శాతం, దక్షిణ తెలంగాణకు 100 శాతం ప్రకారం రేషియో ఇవ్వడం వల్ల రాష్ట్రంలో ప్రతి ఒక్క అభ్యర్థికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన కొంద మంది కానిస్టేబుల్ అభ్యర్థులు జీఓ 46 ద్వారా కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేస్తే తాము తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జీవోను రద్దు చేయాలని కొన్ని రోజులుగా కొంతమంది కానిస్టేబుల్ అభ్యర్థులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పెద్ద ఎత్తున పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యతోనే అభివృద్ధి

కాచిగూడ: గుణాత్మక విద్యను అందించగల విద్యాలయాలు అనతికాలంలో అభివృద్ధి చెందుతాయని రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి అన్నారు. బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి శ్రీమతి ఎ.శ్యామలదేవి మహిళా డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు 'జ్ఞాన సంకల్ప -2023' పేరుతో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. విద్యార్థులు మంచి అలవాట్లను కలిగి ఉండాలని పాఠ్యాంశాలపై ఏకాగ్రతను వహించి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్య సాధనకు ఇష్టపడి పనిచేయాలని సూచించారు. తెలంగాణ యువతి మండలి వైస్ ప్రెసిడెంట్ ఆర్.పద్మజ మల్లికార్జున్, సెక్రటరీ నివేదితకుమార్, కరస్పాండెంట్ డాక్టర్ వసుందర, ప్రిన్సిపల్ లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య

కాచిగూడ: హోలీ మదర్ పీజీ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ బద్దం భూపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం బాలాపూర్‌లోని బద్దం భూపాల్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి బీకాం (కంప్యూటర్స్), బీబీఏ కోర్సుల్లో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు డిగ్రీలో ఉచిత విద్యను అందిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ సునితాభూపాల్ ప్రకటించారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులు దోస్త్ కోడ్ 11219 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. వివరాలకు 9849006877, 6301358961.

వ్యక్తి అదృశ్యం

నల్లకుంట: పని మీద ఇంటి నుంచి బయటికి వెళ్లొస్తానని చెప్పిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రమాదేవి కారె తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్వీ రాజరాజేశ్వరశర్మ కుటుంబంతో కలిసి న్యూ నల్లకుంట శివంరోడ్డులో నివసిస్తున్నారు. అతడి సోదరుడైన ఎస్వీ రామకృష్ణశర్మ(43) నిరుద్యోగి. కాగా జూలై 31న మధ్యాహ్నం ఉద్యోగం కోసం కాలేజీకి వెళ్లి ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఆలస్యంగా ఇంటికి వస్తానని, తన గురించి ఆందోళన చెందొద్దని సాయంత్రం 6.30 గంటల సమయంలో మరో సోదరుడు హరి ఫోన్‌కు మెస్సేజ్ పెట్టాడు. ఆ తర్వాత రామకృష్ణశర్మ ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 7న ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ నేత డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పుర బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, రామకృష్ణ, సందీప్, కృష్ణగౌడ్, వెంకట్‌రెడ్డి, నందకిషోర్, శ్రీధర్, కార్పొరేటర్లు వై.అమృత, కె.ఉమారమేష్‌యాదవ్, బి.పద్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేద ధర్మానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట



వేద పండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న ఎమ్మెల్సీ కవిత

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం భారతీయ సనాతన ధర్మం, ఆచార వ్యవహారాలను పాటిస్తూనే వేద ధర్మానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బ్రహ్మశ్రీ ఘనాపాఠి కె.అనిరుధ్‌శర్మచే శుక్ల యజుర్వేద అఖండ ×కాణ్వశాఖ¤ ఘన పారాయణ మహోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం కాచిగూడలోని తుల్జాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొని వేద పండితులచే ఆశీర్వాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. బ్రాహ్మణ సమాజం తలెత్తుకుని తిరిగేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. సబ్బండ వర్గాలకు చేయూతనిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద బ్రాహ్మణులకు వారి స్వీయ నియంత్రణలో స్వశక్తితో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పథకాలతో జీవించేలా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తుకు రూ.300 కోట్ల నిధులు కేటాయించి పదివేల మందికి లబ్ధి చేకూర్చిందన్నారు. వేద పాఠశాల నిర్వహించేందుకు ప్రతి ఏటా రూ.2.50 లక్షల గ్రాంట్ అందిస్తున్నామన్నారు. ప్రతి వేద పండితుడికి నెలకు రూ.5వేల పెన్షన్ ఇస్తున్నామన్నారు. సంప్రదాయాలు, సంస్కృతికి ఆలయాలే నిలయమని ధర్మ పరిరక్షణకు దేవాలయాలే మూలస్తంభం అని పేర్కొన్నారు. గంగు ఉపేంద్ర శర్మ, గిరీష్ కులకర్ణి, ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, ఘనపాఠీలు ఆర్ఎల్ఎస్ మనోజ్, కుమార్, ప్రతాప్‌చంద్ర, సూర్యనారాయణ, శివ, శ్రీరామ్, కోశం రాజ్‌సీతారాం ఘనపాఠి తదితరులు పాల్గొన్నారు.

13న శుక్లయజుర్వేద అఖండ 'కాణ్వశాఖ'

కాచిగూడ: సద్గురు కృపా ఘన పారాయణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొదటిసారిగా ఘనపాటి కె.అనిరుధ్ శర్మచే ప్రారంభమైన అఖండ 'కాణ్వశాఖ' ఘన పారాయణ మహోత్సవ ముగింపు వేడుకలు ఈ నెల 13న కాచిగూడ తుల్జాభవన్‌లో జరుగుతాయని అర్చక, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, హిందూ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ ఆత్మారామ్ మహారాజ్ ప్రకటించారు.

ఆలోచనలే విజయానికి సోపానాలు



మాట్లాడుతున్న డాక్టర్ వర్ల భానుప్రకాష్‌రెడ్డి

కాచిగూడ: ఆత్మవిశ్వాసంతో కూడిన మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని ఫ్లూరల్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ వర్ల భాను ప్రకాష్‌రెడ్డి అన్నారు. బద్రుకా కళాశాల 74 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం కాచిగూడలోని కళాశాల ఆడిటోరియంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే తమకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఎదురయ్యే అవరోధాలను అధిగమించి విజయాలు సాధించేందుకు సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి వ్యక్తి జీవితంలో రిస్క్ తీసుకుంటేనే విజయాలు సాధించి ఉన్నత స్థానాల్లో నిలుస్తారన్నారు. విద్యార్థులు వేసిన దశావతారం నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. బద్రుక కళాశాల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక, కోశాధికారి రాజేంద్ర బద్రుక, ప్రొఫెసర్ ఎస్. అభిరామకృష్ణ, డాక్టర్ మోహన్‌కుమార్, డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ ఎం.జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అసంఘటిత రంగంలో ఉపాధి పొందుతున్న ఆటో, టాక్సీ, డ్రైవర్లు తదితర రవాణా రంగ కార్మికులకు తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారయ్య మాట్లాడుతూ.. గత 9 ఏళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినా ఒక్కసారి కూడా ఆటోమీటర్ చార్జీలు పెంచలేదన్నారు. దీంతో ఆటోరంగంపై ఆధారపడి జీవిస్తున్న డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర నాయకులు వెంకటేశంగౌడ్, కిరణ్, శ్రీకాంత్, కుమారస్వామి, సత్తిరెడ్డి, ఎం.ఏ.సలీం, మిర్జా రఫత్, రాజుగౌడ్, సీ.హెచ్.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ముషీరాబాద్: నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావాలని భారత్ సేవాశ్రమ్ సంఘ్ నగర అధ్యక్షుడు స్వామి మునీశ్వరానంద సూచించారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని చిత్రాల నర్సింహులు ప్రభుత్వ పాఠశాలలో 600 మంది విద్యార్థులకు ఉచితంగా నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా కవాడిగూడ తాళ్లబస్తీలోని ప్రభుత్వ పాఠశాలతో పాటు అనేక పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. భారత్ సేవాశ్రమ్ సంఘ్ నగర ప్రధాన కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద, పాఠశాల హెచ్ఎంలు శ్రీనివాస్, మేడే దేవదాస్, సంజీవ కుమార్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్‌లోని నందిత గ్రాండ్, మెడ్రస్ టవర్స్, సాయి శ్రీనివాస టవర్స్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు విన్నవించారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు బుధవారం ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో పర్యటించి కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డాక్టర్ విజయలక్ష్మి, ఎస్.ఎల్.గుప్తా, ముఠా జైసింహ, కాలనీవాసులు నారాయణరెడ్డి, భరత్‌రెడ్డి, రవి, ప్రసాద్, మాధవ్, శ్యామ్‌సుందర్, సయ్యద్ అస్లాం, సాయిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్ నగర్ వాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ ఆవరణలోని దీన్‌దయాల్‌నగర్ వాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గతంలో మూడు ఫ్లోర్‌లలో నిర్మించిన 73 ఇళ్లు శిథిలావస్థకు చేరుకుని స్లాబ్ పైకప్పులు ఊడి ప్రమాదకర స్థితికి చేరాయి. రెండు రోజుల క్రితం నరేష్ ఇంటి పైకప్పు కూలడంతో భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం దీన్‌దయాల్‌నగర్‌ను సందర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించాలని, ప్రస్తుతానికి మరమ్మతులు చేయించాలని కోరడంతో ఎమ్మెల్యే అంగీకరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, అస్లాం, మహ్మద్ ఖదీర్, మల్లికార్జున్‌రెడ్డి, రవి యాదవ్, గురుదీప్‌సింగ్, అబ్బూ, హిమాయత్‌ఖాన్, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే సంక్షేమ ఫలాలు



యాత్రను ప్రారంభిస్తున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకన్నగౌడ్

కాచిగూడ: బీసీలు ఐక్యంగా రాజ్యాధికారం సాధించినప్పుడే సంక్షేమ ఫలాలు అందుతాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్నగౌడ్ అన్నారు. బీసీల హక్కుల సాధనకు ఈనెల 4న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నాకు బయలుదేరి వెళ్తున్న బీసీనేతలు, కార్యకర్తలకు బుధవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీబిల్లు పెట్టి చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహేష్, రాంబాబు, నరేందర్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలలోపే ఆర్టీసీని విలీనం చేయాలి

చిక్కడపల్లి: ఎన్నికలలోపే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని జవహర్‌నగర్ యంగ్‌మెన్స్ అసోసియేషన్ సలహాదారు, బీజేపీనేత జయేందర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులపై ప్రేమ ఉంటే ఎప్పుడో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేవారన్నారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ ఆస్తులు, డబ్బులు ఉపయోగపడతాయనే ఆశతోనే ఈ ప్రకటన చేశారని విమర్శించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ఈ ఎన్నికలలోపే నిర్వహించాలని డిమాండ్ చేశారు.